


నల్లమందు గోడౌన్‌లో తనిఖీలు

దుర్గి: బోలేపల్లి గ్రామ శివారులో ఉన్న నల్ల మందు గోడౌన్‌లో మంగళవారం గురజాల ఆర్డీఓ మురళి తనిఖీలు నిర్వహించారు. పరిసరాలను పరిశీలించారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్‌నుంచి 7,004 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 48,286 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 40,985 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఏపీ రాష్ట్ర డిప్యూటీ సీఎం కె.పవన్ కళ్యాణ్ ఈనెల 11న బాపట్ల పర్యటనకు రానున్నారని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బాపట్ల మండలంలోని నగరవనంలో ప్రత్యేక కార్యక్రమం జరగనుందన్నారు. అంతరించి పోతున్న తాటి మొక్కలను సంరక్షించాలనే ఉద్దేశంతో నగరవనానికి వచ్చే మార్గంలో పవన్ కళ్యాణ్ తాటి మొక్కను నాటనున్నారు. అనంతరం నగరవనంలో అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అటవీ సిబ్బందికి నివాళులర్పించనున్నారన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులతోనూ ఆయన సమావేశం కానున్నారన్నారు. పవన్ కళ్యాణ్ హెలికాప్టర్ ద్వారా బాపట్లకు రానున్నారని చెప్పారు. పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ తుషార్ డూడీ పర్యవేక్షిస్తారన్నారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా సంయుక్త కలెక్టర్ డీఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు గ్రామాల్లో సొంతంగా నిధులు సమకూర్చుకునే విధానాన్ని పాటించాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో సమావేశ మందిరం



గుంటూరు వెస్ట్: అత్యాధునిక హంగులతో పునర్నిర్మించిన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి మంగళవారం ప్రారంభించారు. దీనిని ఏపీఈడబ్ల్యూడీసీ (ఏపీ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సంస్థ ఆధ్వర్యంలో నిర్మించారు. ఆధునిక సీట్లతోపాటు లాంగ్ టేబుల్, నూతన మైక్, ఫర్నిచర్, భారీ టీవీ తెరలు, విద్యుద్దీపాల వ్యవస్థ, నూతన ఏసీలు వంటి వసతులు కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులతోపాటు అన్ని రకాల సమావేశాలు పూర్తి వసతులతో ఉపయోగించుకునే వెసులుబాటు ఇందులో ఉంటుందన్నారు. ఈ నెల 3వ తేదీన జేసీ ఎ.భార్గవ్ తేజ బదిలీ అయిన సంగతి తెలిసిందే. దీని నిర్మాణంలో ఆయన పాత్ర ఎంతో ఉండడంతో ఆయనతో కలిసి కలెక్టర్ మందిరాన్ని ప్రారంభించారు. డీఆర్వో షేక్ ఖాజావలి, ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ అనిల్ కుమార్, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్లలో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్తున్న రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



రేపల్లెలో అన్నదాత పోరు కార్యక్రమానికి భారీగా తరలిన రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు



చీరాలలో ర్యాలీలో పాల్గొన్న రైతులు, చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పార్టీ నాయకులు

కట్టలు తెగిన ఆక్రోశం

కట్ట యూరియా కోసం కొట్లాటలు..
కిలోమీటర్ల కొద్దీ బారులు తీరిన లైన్లు..
వచ్చే అరకొర సైతం దక్కక గుండెకోతలు..
టూకీగా యూరియా కోసం
ఇవీ అన్నదాతల వెతలు

సాగుపనుల్లో బిజీగా ఉండాల్సిన రైతన్నను కూటమి ప్రభుత్వం గజిబిజి చేస్తోంది.. పొలాల్లో ఉండాల్సిన అన్నదాత కట్ట యూరియా కోసం సహకార సంఘాల ముందు పడిగాపులు కాస్తున్నాడు. కంటి మీద కునుకు లేకుండా.. ఎప్పుడొస్తాయో తెలీక.. వచ్చినా దక్కుతాయన్న నమ్మకంలేక దిక్కుతోచని స్థితిలో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ రైతుల పక్షాన.. వారి గొంతుకై నిలిచింది.. కూటమి సర్కారు నిర్లక్ష్యాన్ని ప్రశ్నించింది. జిల్లావ్యాప్తంగా అన్నదాతలు వైఎస్సార్ సీపీ శ్రేణులతో పదం కలిపి కదం తొక్కుతూ పోరుబాట సాగించారు.

- తగినంత ఎరువులు అందించాలని డిమాండ్
- యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలకుండా అడ్డుకోవాలని నినాదాలు
- గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, ఉచిత పంటల బీమా పునరుద్ధరించాలని డిమాండ్
- బాపట్లలో వంద ట్రాక్టర్లతో ర్యాలీ
- వేమూరు, రేపల్లెలో బైక్ ర్యాలీలు
- చీరాలలో నిరసన ప్రదర్శన
- పాల్గొన్న పర్చూరు, అద్దంకి శ్రేణులు
- సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్డీఓలకు వినతులు
- పార్టీ సమన్వయకర్తల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునందుకున్న పార్టీ శ్రేణులు మంగళవారం రైతులకు మద్దతుగా నిర్వహించిన అన్నదాత పోరు జిల్లాలో హోరెత్తింది. రైతులకు తగినంతగా ఎరువులు అందించాలని, యూరియా కొరతలేకుండా చూడాలని, ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. జిల్లాలోని బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్డీఓ కార్యాలయాల పరిధిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆందోళనకు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, రైతులు ఉప్పెనలా తరలి వచ్చారు. ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత రాకుండా చూడాలన్నారు. ఉచిత పంటల బీమాతోపాటు పంటలు దెబ్బతిన్న ప్రాంతంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని నినదించారు. మొత్తంగా మంగళవారం జరిగిన అన్నదాతపోరు జిల్లాలో విజయవంతమైంది.

బాపట్లలో భారీ ర్యాలీ

బాపట్లలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆధ్వర్యంలో అన్నదాత పోరు ఆందోళన జరగ్గా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున పాల్గొన్నారు. స్థానిక కోన భవన్ నుంచి వేలాదిమందితో భారీ ర్యాలీ నిర్వహించారు. వంద ట్రాక్టర్లతో రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ సమీపంలో పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకోగా చాలాసేపు అక్కడే నిరసన తెలిపారు. అనంతరం అక్కడికే వచ్చిన బాపట్ల ఆర్డీఓ గ్లోరియాకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కేవీ ప్రసాద్, స్థానిక నేతలు సీతారామిరెడ్డి, గవిని కృష్ణమూర్తి, కొక్కిలిగడ్డ చెంచయ్య, చల్లారామయ్య, సీతారామరాజు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో ఉధృతం

వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో వేలాదిమంది పార్టీ శ్రేణులు, రైతులు భట్టిప్రోలు మండలం యామవరం అడ్డరోడ్డునుంచి వందలాది బైకులపై ర్యాలీగా రేపల్లెకు చేరుకున్నారు. పలుచోట్ల అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా అశోక్‌బాబు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు చివరకు తప్పుకున్నారు. రేపల్లె ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ప్రభుత్వం రైతులకు ఎరువులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని తక్షణం తగినంత ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

- రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో చెరుకుపల్లి నుంచి వందలాదిమంది పార్టీశ్రేణులు, రైతులు నగరం మీదుగా రేపల్లెకు చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. అనంతరం పార్టీ వేమూరు సమన్వయకర్త అశోక్ బాబు, పార్టీ జిల్లా పరిశీలకుడు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, నియోజకవర్గ పరిశీలకుడు చేజెర్ల నారాయణరెడ్డి తదితరులతో కలిసి ఆర్డీఓ రామలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు.

యూరియా కొరతపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కదం తొక్కిన రైతన్న



బాపట్లలో ఆర్డీఓ కార్యాలయానికి ప్రదర్శనగా వెళుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, బాపట్ల సమన్వయకర్త కోన రఘుపతి, రైతులు, నాయకులు

అడుగడుగునా పోలీసు నిర్బంధాలు

వైఎస్సార్ సీపీ నిర్వహించిన అన్నదాత పోరుకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించి ఇబ్బందులు పెట్టారు. పార్టీ ముఖ్యనేతలను అరెస్ట్ చేస్తామని, ట్రాక్టర్లు ఇతర వాహనాలు తీసుకొని వచ్చి ఆందోళనల్లో పాల్గొంటే కేసులు పెడతామని బెదిరింపులకు దిగారు. రైతులు, పార్టీ కార్యకర్తలు ఆందోళనలో పాల్గొనకుండా వారు వచ్చే దారులను అడ్డగించారు. చాలామందిని వెనక్కి తిప్పి పంపారు. బాపట్లలో ఆందోళనకు వచ్చేందుకు ప్రయత్నించిన పలుగ్రామాల కార్యకర్తలు, రైతులను అడ్డగించారు. రేపల్లె, వేమూరు, పర్చూరు, అద్దంకి, చీరాల ప్రాంతాల్లోనూ పోలీసులు వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులను అన్నదాత పోరుకు హాజరుకాకుండా అడుగడుగునా అడ్డుతగిలారు.

చీరాలలో పోరుబాట

చీరాల సమన్వయకర్త కరణం వెంకటేశ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జునతో కలిసి వందలాదిమంది పార్టీ శ్రేణులు, రైతులు చీరాల పట్టణంలోని ముక్కోణం పార్కు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడినుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టకుండా తక్షణం అవసరమైన ఎరువులను అందించాలని డిమాండ్ చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే నిరసనకు దిగారు.

- అద్దంకి సమన్వయకర్త సోదరుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు రెవెన్యూ డివిజన్ కేంద్రమైన చీరాలకు తరలివచ్చి చీరాల సమన్వయకర్త కరణం వెంకటేశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జునతో కలిసి అన్నదాత పోరులో పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణం రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.
- పర్చూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు, రైతులు మంగళవారం చీరాలలో జరిగిన అన్నదాత పోరు ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వం రైతులకు తక్షణం న్యాయంచేయాలని, తగినంతగా ఎరువులు ఇవ్వడంతోపాటు అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అందరూ కలిసి ఆర్డీఓ చంద్రశేఖర నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డి, కేవీ ప్రసాద్‌లు పాల్గొన్నారు.



రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, డాక్టర్ ఈవూరి గణేష్ వరికూటి అశోక్‌బాబు



బాపట్ల ఆర్డీఓ గ్లోరియాకు వినతిపత్రం అందిస్తున్న మేరుగ నాగార్జున, కోన రఘుపతి

రైతులను విస్మరించిన ప్రభుత్వం

చంద్రబాబునాయుడు సర్కారు రైతులను పూర్తిగా విస్మరించింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించటం చేతగాని ప్రభుత్వం కనీసం రైతులు పండించుకునేందుకు యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉంది. రైతుల కన్నీరు ప్రభుత్వానికి శాపంగా మారే రోజులు దగ్గరపడ్డాయి. మంత్రులు సైతం చేతకాని, పనికిరాని ప్రకటనలు ఇచ్చి రైతులను కించపరిచేవిధంగా మాట్లాడటం చూస్తుంటే చాలా బాధ కలుగుతోంది. ఖచ్చితంగా రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే. రైతుల సంక్షేమం వైఎస్ జగన్‌తోనే సాధ్యం

– మేరుగ నాగార్జున,
వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు నాయుడు కుట్ర పన్నుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంట విక్రయించేవరకు అన్ని విధాలుగా రైతులకు ఆర్‌బీకేల ద్వారా సేవలు అందించాం. నేడు కూటమి ప్రభుత్వం ఆర్బీకేలను నిర్వీర్యం చేస్తోంది. రూ. 260 ఉన్న యూరియా బస్తా ఇప్పుడు రూ.400 – 600 పలుకుతోంది. పత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకునే స్థితి నుంచి వరిరైతులు ఆత్మహత్యలు చేసుకునే రోజులు వచ్చాయి. బ్లాక్ మార్కెట్‌లో ఎరువుల విక్రయాలు జరగకుండా చూడాలి.

– కోన రఘుపతి,
బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త

న్యాయవాదులపై దాడులు గర్హనీయం

- ఇటీవలికాలంలో పెరిగిన పోలీసుల వేధింపులు
- అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్టు అమలుకు డిమాండ్
- అక్రమ కేసులను నిరసిస్తూ విధులు బహిష్కరించిన చీరాల న్యాయవాదులు

చీరాల రూరల్: న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్న తీరుకు నిరసనగా మంగళవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, మేరుగు రవికుమార్ మాట్లాడారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై పోలీసులు ప్రదర్శిస్తున్న తీరు అత్యంత హేయంగా ఉందన్నారు. తమ కక్షిదారుల తరఫున పోలీసు స్టేషన్‌కు వెళ్లి న్యాయసహాయం అందిస్తున్న న్యాయవాదులపై పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. న్యాయవాదులను ఎందుకు వెంటబెట్టుకొస్తున్నారని పోలీసులు కక్షిదారులను ప్రశ్నిస్తూ బెదిరిస్తున్నారని తెలిపారు.


- ఇటీవల బాపట్లలో జరిగిన ఓ సంఘటనలో న్యాయవాది తన కక్షిదారుని తరఫున పోలీసు స్టేషన్‌కు వెళ్లగా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ ఆ న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించారని చెప్పారు. ఆ సంఘటన మరువకముందే నందిగామ పోలీసులు ఇద్దరు న్యాయవాదులపై అన్యాయపు కేసులు నమోదు చేయడం విచారకరమన్నారు. అలాగే వారం రోజులు క్రితం బాధితుల పక్షాన అనంతపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదిపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించి అతనిని చుట్టుముట్టి రౌడీని లాక్కెళ్లినట్లు బలవంతంగా జీపులో ఎక్కించారని చెప్పారు. అలాగే రెండు రోజులు క్రితం ఒంగోలు పోలీసులు తామేమీ తక్కువ కాదని నిరూపించుకున్నారని, బాధితుని పక్షాన నిలబడినందుకు ఆ న్యాయవాదిపై అక్రమంగా కేసు నమోదు చేశారని మండిపడ్డారు. ఈ విధంగా రాష్ట్రంలో ఏదోఒక ప్రాంతంలో న్యాయవాదులపై పోలీసులు కక్షపూరిత చర్యలకు పాల్పడడం చూస్తుంటే న్యాయవాదులు తమ విధులు చేసుకునే పరిస్థితులు కనబడటంలేదన్నారు. తక్షణమే పోలీసు ఉన్నతాధికారులు, పాలకులు ఈ విషయాలను గుర్తించి న్యాయవాదులపై అమానుషంగా ప్రవర్తించే పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వాలు స్పందించి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



తోడేటి హర్ష వర్ధన్ (ఫైల్)

కొల్లూరు: కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చింతర్లంకకు చెందిన తోడేటి హర్షవర్ధన్ (22) ఆదివారం రాత్రి పెసర్లంక అరవింద వారధి పైనుంచి కృష్ణా నదిలో దూకి గల్లంతయ్యాడు. సోమవారం తెల్లవారుజాము నుంచి యువకుడి జాడ కోసం గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు నదిలో తీవ్రంగా గాలించారు. యువకుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో నది అంచుల వెంబడి గాలింపు జరిపారు. అయితే మంగళవారం మధ్యాహ్నం కృష్ణా జిల్లా నాగాయలంక మండలం పెదపాలెం సమీపంలో కృష్ణా నదిలో చెట్లకు మృతదేహం పట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. నాగాయలంక పోలీసుల నుంచి కొల్లూరు పోలీసులకు సమాచారం అందడంతో మృతుడి బంధువులను తీసుకొని వెళ్లి నదిలో తేలిఉన్న మృతదేహాన్ని చూపించగా, గల్లంతైన హర్షవర్ధన్‌గా బంధువులు నిర్ధారించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న కొల్లూరు పోలీసులు కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భద్రపరిచారు. మృతుడి తల్లి పుష్పమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి తండ్రి కొద్దికాలం క్రితం గుండెపోటు కారణంగా మృతి చెందడంతో మృతుడు హర్షవర్ధన్ తల్లి, సోదరితో కలసి జీవిస్తున్నాడు.



కృష్ణా జిల్లా నాగాయలంక సమీపంలో కృష్ణా నదిలో చెట్లకు పట్టి ఉన్న మృతదేహం

బస్సుల రద్దుతో ఇక్కట్లు

- అనంతపురం సూపర్ సిక్స్ సభకు తరలిన బస్సులు
- మూడు రోజులపాటు సర్వీసులు అందుబాటులో లేనట్లే..

బల్లికురవ: సూపర్‌సిక్స్ సంబరాల పేరిట పల్లె వెలుగు బస్సులను అనంతపురం సభకు పంపటంతో మంగళవారం నుంచి బల్లికురవ – సంతమాగులూరు మండలాలో తిరిగే సింగల్ రూట్ బస్సు సర్వీసులకు బ్రేక్ పడింది. అద్దంకి డిపో నుంచి బల్లికురవ, సంతమాగులూరు మీదుగా నరసరావుపేట వెళ్లే బస్సు, గోవాడ మార్టూరు మీదుగా చిలకలూరిపేట వెళ్లే బస్సు, వైదన బల్లికురవ మీదుగా చిలకలూరిపేట వెళ్లే బస్సు, మైలవరం బస్సు, చిలకలూరిపేట డిపో నుంచి మర్టూరు, బల్లికురవ, కొమ్మాలపాడు మీదుగా కుందుర్రు వెళ్లే బస్సు, చిలకలూరి పేట నుంచి ఉప్పుమాగులూరు వెళ్లే బస్సులను రద్దు చేశారు. అద్దంకి నుంచి కొమ్మాలపాడు మీదుగా నరసరావుపేట, అద్దంకి నుంచి కూకట్లపల్లి మీదుగా వినుకొండ వెళ్లే బస్సులకు కోత విధించారు. బుధవారం అనంతపురం సమీపంలోని జీఎంఆర్, ఇంద్రప్రస్థ గ్రౌండ్స్‌లో జరగనున్న సూపర్‌సిక్స్ సంబరాలకు అద్దంకి, చిలకలూరిపేట, వినుకొండ డిపోలనుంచి పల్లె వెలుగు బస్సులు తరలించడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. గురువారం వరకు ప్రయాణికులకు కష్టాలు తప్పేలా లేవు. మహిళలకు స్త్రీశక్తి పేరిట ఉచిత ప్రయాణం అంటూ అరకొర బస్సులు కేటాయించగా.. వాటిని సైతం అనంతపురం పంపడమేంటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని 15 గ్రామాల ప్రయాణికులు కుందుర్రు బస్సును రద్దు చేయడంపై డిపో మేనేజర్‌తో మాట్లాడటంతో మంగళవారం సాయంత్రం పునరుద్ధరించారు. అయితే బుధ, గురువారాల్లో యథావిధిగా నడపాలని ప్రయాణిలు కోరుతున్నారు.



బస్సులు రద్దు చేయడంతో ప్రమాదభరితంగా ఆటోలో ప్రయాణిస్తున్న దృశ్యం

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,800

మోడల్ ధర రూ. 2,400

పసుపు ధరలు

(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 375

కొమ్ములు : 243బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	10,250	10,150

కాయలు : 132 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	10,150	10,150

మొత్తం అమ్మకాలు : 281.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	48,304
అమ్మకాలు	47,072
నిల్వ	17,845

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,500
నంబరు–5	10,000–13,500
341	11,000–15,400
4884	10,000–14000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,600
నంబరు–5	10,000–13,600
341	11,000–15,800
4884	10,000–14,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,300
బాడిగ 355	10,000 – 15,500
దేవనూరు డీలక్స్	10,000 – 14,000
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	6,200 – 8,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,400
బాడిగ 355	10,000 – 15,300
దువనూర్ డీలక్స్	10,500 – 13,600
తాలు	5,500 – 7,500

–కొరిటిపాడు (గుంటూరు)

కదం తొక్కిన కర్షకలోకం

- అన్నదాత పోరు.. జన హోరు
- కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆగ్రహం
- భారీగా కలెక్టరేట్‌కు చేరుకున్న రైతులు
- రైతన్నకు అండగా వైఎస్సార్ సీపీ



బాపట్ల కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, కోన రఘుపతి



బాపట్ల కలెక్టరేట్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

బాపట్ల: రైతన్నకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి భారీగా రైతులు తరలి వచ్చారు. ట్రాక్టర్లతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు వచ్చి కనీసం యూరియా కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, బాపట్ల సమన్వయకర్త కోన రఘుపతిలు ర్యాలీలో పాల్గొని రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని అభయమిచ్చారు. బాపట్ల నియోజకవర్గంలో కోన రఘుపతి పిలుపు మేరకు ప్రతి గ్రామం నుంచి ట్రాక్టర్లపై రైతులు బాపట్లకు చేరుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ వరకు రైతులు పాదయాత్రగా వెళ్లారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ప్రదర్శనలో పాల్గొన్ని తమ నిరసన తెలియజేశారు.

భారీగా మోహరించిన పోలీసులు

వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి భారీగా రైతులు చేరుకుంటున్నారని తెలుసుకున్న పోలీసులు భారీగా మోహరించారు. డీఎస్పీ రామాంజనేయులు, సీఐ రాంబాబు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అడుగడుగునా పోలీసులు ప్రదర్శనను అడ్డుకున్నారు. రైతులు పోలీసులను సైతం లెక్క చేయకుండా తమ నిరసన గళాన్ని వినిపించారు. కలెక్టరేట్‌లోకి పంపకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్డీఓ గ్లోరియాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు కె.వి.ప్రసాద్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఈద శ్రీనివాసరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, గవిని కృష్ణమూర్తి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, రాష్ట్ర కార్యదర్శులు చేజర్ల నారాయణరెడ్డి, నక్కా వీరారెడ్డి, మండే విజయ్‌కుమార్, చల్లా రామయ్య, వడ్డిముక్కల డేవిడ్, చింతల రాజశేఖర్, ఇనగలూరి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను దగా చేసిన ప్రభుత్వం

ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు, డాక్టర్ గణేష్, అశోక్‌బాబు

రేపల్లె: రాష్ట్రంలోని కూటమి సర్కారు రైతులను దగా చేసిందని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు తుమాటి మాధవరావు అన్నారు. వైఎస్సార్ సీపీ అధినాయకత్వం పిలుపు మేరకు రేపల్లె, వేమూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు డాక్టర్ ఈవూరు గణేష్, వరికూటి అశోక్‌బాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇసుకపల్లి నుంచి రెండు నియోజకవర్గాల రైతులు, కౌలు రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలి వచ్చి రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మికి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

- అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాధవరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే రైతులకు విత్తుకునే విత్తనం నుంచి సకాలంలో ఎరువులు, పురుగుమందులను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించారన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నారని తెలిపారు. దానికి భిన్నంగా నేటి కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. నేడు ఒక్క కట్ట యూరియా కోసం ఎర్రటెండలో బారులు తీరి ఉండాల్సిన దుస్థితిని ఈ ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం కూడా పూర్తిగా ఇవ్వకుండా రైతాంగాన్ని దగా చేశారన్నారు. అదేవిధంగా ప్రతి మహిళకు సంవత్సరానికి మూడు సిలిండర్లు అందిస్తామని చెప్పి, ఒక్క సిలిండర్‌తో సరిపెట్టారని, మహిళలకు ఉచిత బస్సు అని ప్రవేశపెట్టి నెల కావస్తున్నా.. తగినన్ని బస్సులు అందుబాటులో లేకుండా మోసం చేశారన్నారు.
- ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగులకు సైతం వికలాంగత్వం పర్సంటేజ్ వ్యత్యాసం ఉందని లక్షలాది మందికి పింఛన్ ఎత్తేసే కుట్రకు తెర లేపిన దుర్మార్గ ప్రభుత్వమిది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులు, పింఛన్‌దారులు, మహిళలు, అన్ని వర్గాల వారు ఇక్కట్లకు గురవుతుంటే.. కూటమి నేతలు విజయోత్సవ సభలు నిర్వహించడం విడ్డూరమన్నారు. రైతులు, నాయకులు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనీల్, దుండి వెంకటకామిరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ, వీసం నాగలక్ష్మి పాల్గొన్నారు.

రైతును కన్నీరు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్
- రేపల్లెలో విజయవంతంగా అన్నదాత పోరు

చెరుకుపల్లి: రాష్ట్రంలో ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా రైతులకంటే కూటమి దళారులకే ఎక్కువగా అందుతుందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పేర్కొన్నారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచే నియోజకవర్గంలోని ఆయా మండలాల కన్వీనర్లు గ్రామాల్లో రైతులను, కౌలు రైతులను, పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు. భారీ ర్యాలీగా ఇసుకపల్లి కూడలి వద్ద అన్ని మండలాల వాహనాలు సమాయత్తమై ప్రతి రైతుకు యూరియా అందించాలి, యూరియా బ్లాక్‌మార్కెట్ తరలింపును అరికట్టాలి, కూటమి ప్రభుత్వం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో ఆర్డీఓ కార్యాలయానికి తరలివెళ్లి ఆర్డీఓ రామలక్ష్మికి పార్టీ బాపట్ల పార్లమెంట్ పరిశీలకుడు, ఎమ్మెల్సీ మాధవరావు, రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, రేపల్లె నియోజకవర్గ పరిశీలకుడు నారాయణరెడ్డి, మరియు రెండు నియోజకవర్గాల పార్టీ కన్వీనర్లు, రైతు నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం డాక్టర్ గణేష్ మాట్లాడుతూ రైతు కన్నీరు కారిస్తే అది సమాజానికి మంచిదికాదని, కూటమి ప్రభుత్వం రైతుచే కన్నీరు పెట్టిస్తుందన్నారు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల చుట్టూ తిరుగుతున్నా యూరియా అందటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎరువులు పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించటంతో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరేటి శేషగిరిరావు, దుండి వెంకటరామిరెడ్డి, యార్లగడ్డ రింబాబు, చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ, చదలవాడ శ్రీనివాసరావు, కర్రి వెంకట కృష్ణారెడ్డి, నిజాంపట్నం కోటేశ్వరరావు, ఉయ్యూరు శాంతిరాజు, లుక్కా బాపనయ్య, దొంతిబోయిన కొండలరెడ్డి, వీసం నాగలక్ష్మి, అప్రోన్స్‌పాల్, సొంటి సురేష్, పాగోలు వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రేపల్లెకు భారీ బైక్ ర్యాలీ



వేమవరం నుంచి రేపల్లెకు అశోక్‌బాబు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: కూటమి ప్రభుత్వంలో రైతులకు ఆది నుంచి కష్టాలేనని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. అశోక్‌బాబు ఆధ్వర్యంలో అన్నదాత పోరు సందర్భంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు భట్టిప్రోలు మండలం వేమవరం అడ్డరోడ్డు నుంచి పల్లెకోన మీదుగా రేపల్లె వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేమూరు, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్తలు అశోక్‌బాబు, ఈవూరు గణేష్‌బాబు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు, ఎరువులు బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రైతే రాష్ట్రానికి వెన్నుముక అని పొగిడిన కూటమి నేతలు.. ఎన్నికలయ్యాక రైతులకు వెన్నుపోటు పొడిచారన్నారు. అనంతరం ఆర్డీఓ నాగలక్ష్మికు వినతి పత్రం అందచేశారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గంలోని భట్టిప్రోలు, వేమూరు, చుండూరు, అమృతలూరు, కొల్లూరు, రేపల్లె, చెరుకుపల్లి, నిజాంపట్నం, నగరం మండలాల పార్టీ మండల కన్వీనర్లు, అన్ని మండలాల్లోని రాష్ట్ర జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, రైతు సోదరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' విజయవంతం చేయండి



బాపట్ల అర్బన్: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమం చేపట్టడంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లు ఈనెల 18వ తేదీన చేపట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు మజుందార్ పేర్కొన్నారు. బాపట్ల పాతబస్టాండులోని ఆటోపాయింట్ వద్ద చలో విజయవాడ కార్యక్రమం కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈసందర్భంగా మజుందార్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగం, వాటిలో ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం కనికరంలేదన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి లేక నిరుద్యోగ యువకులు ఉన్నత చదువులు చదివి ఆటో డ్రైవర్లుగా మారుతున్నారు. ప్రభుత్వాలు వీరికి బ్యాంకుల ద్వారా రుణం ఇవ్వనందున ప్రైవేట్ ఫైనాన్సర్ల దగ్గర అధిక వడ్డీలకు అప్పులతో ఆటోలను కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. అలాంటి వారి పై ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్ రేట్లు పెంచడం, ఇన్స్యూరెన్స్ ప్రీమియం రేట్లు, ఆర్టీఏ చలానాలు, ఈ–చలానా ఫైన్లు, మ్యాట్రిక్స్ కెమెరాల సెన్సార్ ఫైన్‌లు వేస్తున్నాయన్నారు. ఈమేరకు ఆటో కార్మికులు చేపట్టే చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ పట్టణ నాయకుడు కె.శరత్, ఆటో వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షులు బుచ్చిరాజు, బ్రహ్మం, నాగరాజు సురేష్, నాని ఆటో కార్మికులు పాల్గొన్నారు.

డాక్టర్ జగదీష్‌రెడ్డికి బంగారు పతకం



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నుంచి బంగారు పతకం అందుకుంటున్న డాక్టర్ జగదీశ్వరరెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉయ్యూరు జగదీష్‌రెడ్డికి గోల్డ్‌మెడల్ లభించింది. మంగళవారం విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 27వ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రొఫెసర్ ఎం.ఆర్.సి.నాయుడు గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాన్ని డాక్టర్ జగదీష్‌రెడ్డి స్వీకరించారు. డాక్టర్ జగదీష్‌రెడ్డి గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో న్యూరో సర్జరీలో సూపర్‌స్పెషాలిటీ పీజీ అభ్యసించారు. పీజీ కోర్సులో యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించినందుకు గోల్డ్ మెడల్ లభించింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, న్యూరో సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణమూర్తి, పలువురు న్యూరో సర్జన్లు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

చెన్నుపల్లికి విశ్వకర్మ ఐకాన్ జాతీయ పురస్కారం



అద్దంకి: పట్టణానికి చెందిన చెన్నుపల్లి శ్రీనివాసాచారి విశ్వకర్మ ఐకాన్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు తనకు వారి నుంచి ఉత్తర్వులు అందాయని మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విశ్వబ్రాహ్మణ సంఘంలోని వారు ఎవరూ వైద్యానికి ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో మూడు సంవత్సరాల నుంచి శ్రీనివాసాచారి వైద్యసేవలు అందేలా చూస్తున్నాడు. దీనికిగానూ 2025 విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన తెలంగాణలోని సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పురస్కారం అందజేయనున్నారు.

ఆర్థిక సేవల్లో నిపుణుడు డాక్టర్ నాగరాజు మద్దిరాల

నేడు తెనాలిలో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ అవార్డు స్వీకరణ




నాగరాజు మద్దిరాల

తెనాలి: ప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డును ఈ పర్యాయం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శిగా చేస్తున్న ఐఏఎస్ అధికారి నాగరాజు మద్దిరాలకు బహూకరించనున్నారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4.30 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటయే సభకు ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా నాగరాజు మద్దిరాలకు అవార్డును ప్రదానం చేస్తారు. ఇదే వేదికపై నాయుడమ్మపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తారు.

తెలుగుతేజం

నాగరాజు మద్దిరాల ఆకివీడు దగ్గర్లోని ఆలపాడు గ్రామంలో 1966లో జన్మించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రంలో డిగ్రీ, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రంలో పీజీ కోర్సు చేశారు. 27 ఏళ్ల వయసులో త్రిపుర కేడర్‌లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. అదే రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆర్థిక, పరిశ్రమల, వాణిజ్యశాఖ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా వంటి కీలక పదవులు నిర్వహించారు. ఆయన హయాంలోనే 2016లో త్రిపుర, 'మోస్ట్ ఇంప్రూవ్డ్ స్మాల్ స్టేట్ ఇన్ ఈ–గవర్నెన్స్'గా గుర్తింపును పొందింది. అదే సంవత్సరంలో రాష్ట్రంలో శిశు మరణాల రేటును 26 నుంచి 21కు తగ్గించినందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి త్రిపురకు రెండో బహుమతి లభించింది. 2004–08లో ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్థిక వ్యవహారాల విభాగంలో జపాన్, ఉత్తర అమెరికా, ప్రపంచ బ్యాంక్ విభాగాల్లో డైరెక్టర్‌గానూ నాగరాజు చేశారు. 2008 – 12లో వాషింగ్టన్ డీసీలోని ప్రపంచ బ్యాంకుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, సలహాదారుగానూ వ్యవహరించారు. బొగ్గు మంత్రిత్వశాఖలో సంయుక్త కార్యదర్శిగా, అదనపు కార్యదర్శిగా వినూత్న సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అనే చారిత్రక మైలురాయిని చేరుకునేలా చేశారు. ప్రస్తుతం ఆర్థిక సేవలశాఖ కార్యదర్శిగా ఆ రంగ బలోపేతానికి కృషి చేస్తున్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ నిరసన



లాల్ వజీర్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న వాకర్స్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ ఆగ్రహించారు. మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లాల్ వజీర్ మాట్లాడుతూ ఉదయం 5 గంటలకు వాకింగ్ చేస్తున్న సమయంలో సిబ్బంది లైట్లు తీసేశారన్నారు. వర్షం కారణంగా స్టేడియం బురదగా ఉందన్నా పట్టించుకోలేదని తెలిపారు. ట్రాక్ పనులు పూర్తి చేయలేదన్నారు. మైక్ మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రౌండ్ మెన్స్ కూడా లేరన్నారు. జిమ్‌లోని కొన్ని పరికరాలు ఎంతో కాలంగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టేడియంలో ఆటలకు బదులు రాజకీయాలు నడుస్తున్నాయని సీనియర్ సభ్యులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఇక్కడి సభ్యులను కలుపుకొని బాస్కెట్ బాల్ కోర్ట్, స్కేటింగ్ రింక్, అత్యాధునిక పరికరాలతో జిమ్, స్టేడియం సుందరీకరణ వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. తర్వాత ఒక్క కొత్త పని కూడా పూర్తి చేయలేదు. ఇటీవల నూతన కమిటీ ఎన్నికలు కూడా టీడీపీలోని రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కారణంగానే రద్దయ్యాయి. కమిటీ వస్తే స్టేడి యం అభివృద్ధి చెందుతుందని భావించిన సభ్యుల కలలు కల్లలుగానే మిగిలిపోయాయి. స్టేడియం నగరపాలక సంస్థకు చెందిన ఆస్తి. అంటే ప్రభుత్వానికి సొంతం. కొందరు వ్యక్తులు మాత్రం స్టేడియం తమదే అన్నట్లు వ్యవహరించడాన్ని పలువురు సభ్యులతోపాటు క్రీడాకారులు తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా రాజకీయాలు ఆపి క్రీడలను ప్రోత్సహిస్తే మేలని ప్రజలు పేర్కొంటున్నారు.